సాక్షి సూర్యాపేట

శనివారం : 16 : సెప్టెంబర్ : 2023



ఉద్యోగ భద్రత కల్పించాలి
కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నాగయ్య కోరారు. - IIలో



దీక్షకు సంపూర్ణ మద్దతు
ఎస్సీ వర్గీకరణ కోసం సూర్యాపేటలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన దీక్షకు విశ్వబ్రాహ్మణ సంఘం సంపూర్ణ మద్దతు తెలిపింది. - IVలో



శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
మట్టపల్లి క్షేత్రంలోని శుక్రవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. - IVలో

న్యూస్‌రీల్

మట్టి వినాయకుడి ప్రతిమలు పంపిణీ



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): నవరాత్రి ఉత్సవాల్లో మట్టి వినాయకుడి ప్రతిమలను పూజించి, పర్యావరణాన్ని కాపాడుదామని జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అన్ని శాఖలకు చెందిన సిబ్బందికి సీడ్ మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా 'గుడిపురి' నియామకం



జిల్లా ప్రధాన జడ్జిని కలిసిన వెంకటేశ్వర్‌రావు

చివ్వెంల: సూర్యాపేట జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది గుడిపురి వెంకటేశ్వర్‌రావును నియమిస్తూ లా కమిషనర్ తిరుపతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌కు అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మర్యాద పూర్వకంగా జడ్జిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్య యాదవ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులంతా ఈ సందర్భంగా గుడిపురి వెంకటేశ్వర్‌రావుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలి

సూర్యాపేట టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఆచార్య భగవంతరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో పీడీఎస్‌యూ (విజృంభణ) ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు– పరిష్కార మార్గాలపై నిర్వహించిన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్య అనేది ఉత్పత్తి సాధనంగా ఉండాలన్నారు. దోపిడీ, దౌర్జన్యాలు, అణచివేతల నుంచి విముక్తి కావడానికి తోడ్పడాలన్నారు. విద్యా ప్రైవేటీకరణ, కాషాయీకరణను వ్యతిరేకించాలన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులన్నీ వెంటనే భర్తీ చేయాలని, విద్యారంగ సంస్థల్లో కనీస వసతులు కల్పించాలని, సరిపడా పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలన్నారు. ఈ సదస్సులో సంఘం నాయకులు బెల్లి నాగరాజు, అల్లూరి విజయ్, పల్లెబోయిన జాని, రాచూరి ప్రతాప్, తీగల పూలాన్, వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మనోభావాలను కించపర్చొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గణేష్ విగ్రహాల నిమజ్జనం విషయంలో హిందువుల మనోభావాలను కించపరిచేలా జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకోవడం తగదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సద్దల చెరువులో వినాయక నిమజ్జనానికి అధికారులు గుర్తించిన ప్రదేశంలో గోరీలు ఉన్నాయని, అక్కడ నిమజ్జనం చేయాలని నిర్ణయించడం హిందువులను కించపర్చడమేనన్నారు. అన్ని పార్టీలు, ఉత్సవ కమిటీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోకుండా మంత్రి ఒక నియంతలా వ్యవహరించారని ఆరోపించారు. గతం మాదిరిగానే ట్యాంక్‌బండ్ నుంచే విగ్రహాల నిమజ్జనం చేస్తామని తెలిపారు. రోడ్ల ఆక్రమణలు, విస్తరణ విషయంలో తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్ లోగోను మార్చడం తగదన్నారు. సమావేశంలో నాయకులు కర్నాటి కిషన్, చలమల్ల నర్సింహ, కట్కూరి కార్తీక్‌రెడ్డి, దనుజయ గౌడ్, అబీద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికల జోష్



- 20వ తేదీన కాంగ్రెస్ కండువా వేసుకోనున్న వేముల వీరేశం!
- తుక్కుగూడ సభ కోసం జన సమీకరణకు వీరేశం ఏర్పాట్లు
- నేడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో చేరనున్న బాలకృష్ణారెడ్డి
- త్వరలో 'హస్తం' గూటికి మరికొందరు బీఆర్‌ఎస్, బీజేపీ అసంతృప్తులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ మొదలు కాబోతోంది. సాధారణ ఎన్నిలకు సమయం దగ్గర పడుతుండడంతో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నుంచి అసంతృప్తులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీలో టికెట్ దక్కని వారిలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ నుంచి ఇటీవల సస్పెండ్ అయిన జిట్టా బాలకృష్ణారెడ్డి భువనగిరి ఎంపీ కోటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. ఆయన నేతృత్వంలో జిట్టా శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. నకిరేకల్ నియోజకవర్గం నుంచి వేముల వీరేశం చేరేందుకు రంగం సిద్ధమైంది. ఆయన ఈ నెల 20న హస్తం గూటికి చేరనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వీరిద్దరికి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించగా, మరికొంత మంది ఆశావహులు కూడా కాంగ్రెస్ కండువా వేసుకునేందుకు రెడీ అవుతున్నట్లు తెలిసింది.

నేడో, రేపో అనుకున్నా..

బీఆర్‌ఎస్ నాయకుడు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని ముందుగా అనుకున్న ప్రకారం 16 లేదా 17వ తేదీన చేర్చుకునేలా కాంగ్రెస్ పార్టీ రంగం సిద్ధం చేసింది. అయితే, 17న హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సభ ఉండటం.. ఆ సభకు సోనియాగాంధీ హాజరవుతుండడంతో హడావుడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో వీరేశం చేరిక వాయిదా వేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం కుదరకపోతే.. 20వ తేదీన వీరేశంను చేర్చుకునేలా పార్టీ పెద్దలు ముహూర్తం ఖరారు చేశారు. ఢిల్లీలో సోనియాగాంధీ సమక్షంలోనే వీరేశం పార్టీలో చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నేతలు వీరేశంతోనూ చర్చించారు. 17వ తేదీ నాటికి సభకు వీరేశం కూడా పెద్ద ఎత్తున జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని నార్కట్‌పల్లి, రామన్నపేటతోపాటు ఇతర మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లేలా రవాణా ఏర్పాట్లపై వీరేశం సమావేశాలు నిర్వహించారు.

అందరి అంగీకారంతో..

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఈసారి తనకు టికెట్ వస్తుందని వేముల వీరేశం ఆశించారు. అయితే, సీఎం కేసీఆర్ సిట్టింగ్‌లకే టికెట్లు ప్రకటించారు. నకిరేకల్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యనే పోటీలో ఉంటారని ప్రకటించడంతో వేముల వీరేశం అసంతృప్తితో ఉన్నారు. ఆయన చివరకు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆయన బీఆర్‌ఎస్ నుంచి బయటకు వెళ్లకుండా, పార్టీ మారకుండా ఉండేందుకు బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. వీరేశం చేరికపై భువనగిరి ఎంపీ కోటిరెడ్డి వెంకట్‌రెడ్డి మొదట్లో సుముఖత వ్యక్తం చేయకపోవడంతో చేరిక ఆలస్యమైంది. తాజాగా కోమటిరెడ్డి నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో 20వ తేదీన వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నేడు కాంగ్రెస్‌లో చేరనున్న 'జిట్టా'

భువనగిరి నియోజకవర్గానికి చెందిన జిట్టా బాలకృష్ణారెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. మొన్నటివరకు బీజేపీలో ఉన్న ఆయనను బీజేపీ ఇటీవల సస్పెండ్ చేసింది. దీంతో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నారు. ఇందులో బాగంగానే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో చర్చించారు. కోమటిరెడ్డి నివాసంలోనే శనివారం జిట్టా బాలకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం



సూర్యాపేటలో మట్టి వినాయక విగ్రహాన్ని అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గణేష్ ఉత్సవ కమిటీలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సూర్యాపేటను పర్యావరణ హితమైన పట్టణంగా తీర్చిదిద్దుకుందామని చెప్పారు. తడి, పొడి చెత్త సేకరణలో ఇప్పటికే జాతీయస్థాయి గుర్తింపు దక్కిందని, ప్లాస్టిక్ నివారణ విషయంలోనూ ముందుండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా మానవాళికి ప్లాస్టిక్‌తో ముప్పు పొంచి ఉందని, ప్లాస్టిక్ నివారణకు మనం చేయగలిగిన మేలు చేయాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనంతో నీరు కాలుష్యం అవుతుందని, ఆ నీటితో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. అందుకే మట్టి విగ్రహాలు పెట్టుకోవాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారని, తొమ్మిదేళ్లుగా సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీతోపాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లలో అందుబాటులో ఉన్న మట్టి విగ్రహాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్తగా తయారు చేసి తీసుకొచ్చిన మూడు వేల సీడ్ విగ్రహాలు రేపటి నుంచి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిశోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు కింద రూ.12 లక్షలు ఇప్పిస్తాం



హుజూర్‌నగర్ : గిరిజన సంప్రదాయ వస్త్రాలు ధరించిన పద్మావతి, చిత్రంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్/కోదాడ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దళితులందరికీ దళితబంధు పథకం కింద రూ.12 లక్షలు ఇప్పిస్తామని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఎంపీ ఉత్తమ్, పద్మావతి దంపతులు హుజూర్‌నగర్, కోదాడలో శుక్రవారం నూతన గృహ ప్రవేశాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించి, భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన హుజూర్‌నగర్, కోదాడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో జరిగే సోనియాగాంధీ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని పలు పార్టీలకు చెందిన పలువురు ఎంపీ ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ చేరారు. మాజీ ఎమ్మెల్యే పద్మావతి గిరిజన సంప్రదాయ వస్త్రాలు ధరించి గిరిజనులతో కలిసి అలరించారు. అనంతరం ఉత్తమ్, పద్మావతి దంపతులను గజమాలతో ఘనంగా సన్మానించారు. హుజూర్‌నగర్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో నాయకులు యరగాని నాగన్న, సాముల శివారెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు, అన్నపురెడ్డి అప్పిరెడ్డి, సాముల జైపాల్‌రెడ్డి, అరుణ్ కుమార్ దేశ్‌ముఖ్, రంగనాథ్, నీలా మంజూనాయక్, కె.చిన వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, కొట్టే సైదేశ్వరరావు, శాగంరెడ్డి గోవిందరెడ్డి, గోపాల్ నాయక్, మోతీలాల్, సుబ్బారావు, శివరాం యాదవ్, కౌన్సిలర్లు శ్రావణ్ కుమార్, రాజా నాయక్, సంపత్‌రెడ్డి, విజయ వెంకటేశ్వర్లు, ధనమ్మ జైలు, సరితా వీరారెడ్డి, కుక్కడపు మహేష్, జక్కుల మల్లయ్య, గల్లా వెంకటేశ్వర్లు, ముషం సత్యనారాయణ, శకుంతలరెడ్డి, చప్పిడి సావిత్రి, గొట్టిముక్కుల నిర్మల, బి.లక్ష్మి పాల్గొన్నారు. అలాగే కోదాడలో గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో నలమాద పద్మావతిరెడ్డి, వంగవేటి రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి, పార సీతయ్య, బషీర్, అప్పిరెడ్డి, సంతోష్‌రెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, దేగ శ్రీధర్, మాతంగి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



కోదాడలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చవితికి 'భారీ' సన్నాహాలు

పెద్ద విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు సిద్ధమవుతున్న ఉత్సవ కమిటీలు

- జిల్లా వ్యాప్తంగా జోరందుకున్న వినాయక ప్రతిమల కొనుగోళ్లు
- ఇప్పటికే భారీ విగ్రహాల బుకింగ్
- మండిపోతున్న ధరలు.. వెనక్కి తగ్గని యువకులు



సూర్యాపేటలో వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో వినాయక చవితి సందడి నెలకొంది. ఈ నెల 18వ తేదీన వినాయక చవితి నేపథ్యంలో ఉత్సవ కమిటీలు భారీ సెట్టింగ్‌లతో మండపాలు నెలకొల్పేందుకు సన్నద్ధమవుతున్నాయి. అందులోనూ భారీ విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు కమిటీలు ఉత్సాహం చూపుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో విక్రయానికి ఉన్న భారీ గణనాథుల ప్రతిమలు బుకింగ్ పూర్తయింది. భారీ విగ్రహాలతో పాటు 10, 12 ఫీట్ల విగ్రహాల కొనుగోలుకు ఉత్సవ కమిటీల సభ్యులు పట్టణాలకు తరలి వస్తున్నారు. ఇకపోతే మట్టి విగ్రహాల ఏర్పాటు అంతంత మాత్రంగానే ఉండగా.. ఇళ్లలో పూజల నిమిత్తం ప్రజలు విగ్రహాల కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. దీంతో ఈ సంవత్సరం భారీ విగ్రహాలు ప్రతిష్ఠించడం ద్వారా వినాయక చవితి వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

కొనుగోళ్లతో సందడి..

వినాయక చవితికి రెండురోజుల సమయమే ఉండడంతో వినాయక ప్రతిమల కొనుగోళ్లు జోరందుకున్నాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంతో పాటు కోదాడ, తిరుమలగిరి, అర్వపల్లి, తుంగతుర్తి, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద శుక్రవారం నుంచి సందడి నెలకొంది. అధికంగా సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో విగ్రహాల విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాకేంద్రంలోని పలుచోట్ల ఏటా నెలకొల్పుతున్న భారీ గణనాథులను ఇప్పటికే హైదరాబాద్, విజయవాడల నుంచి తీసుకొచ్చారు. జిల్లావ్యాప్తంగా గతేడాది 3వేల వినాయక విగ్రహాలను నెలకొల్పగా.. ఈ సంవత్సరం గతంలో కంటే 200 అధికంగా నెలకొల్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. పండుగపై ఆంక్షలు లేకపోగా.. ఎన్నికల సంవత్సరం కావడంతో యువతను ప్రసన్నం చేసుకునేందుకు ఆయా పార్టీల నుంచి దాతల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

15 ఫీట్ల విగ్రహానికి రూ.75వేలు !

వినాయక విగ్రహాల ధరలు మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా చిన్న విగ్రహాల నుంచి పెద్దవాటి దాకా అధిక ధరలు పలుకుతున్నాయి. రూ.వెయ్యి నుంచి రూ.75వేల ధర ఉన్న విగ్రహాలను సూర్యాపేట జిల్లాకేంద్రంలో విక్రయిస్తున్నారు. గతంలో ఉన్న ధరల కన్నా చిన్న విగ్రహాలకు రూ.5వేలు, పెద్ద విగ్రహాలకు రూ.20వేలు అదనంగా చెబుతున్నట్లు యువత అంటోంది. ప్రధానంగా దాతల ద్వారానే ఉత్సవ కమిటీలు కొనుగోలు చేస్తున్నాయన్న భావనతో ఇష్టానుసారంగా ధరలు చెబుతున్నారనే స్పష్టంగా అర్థమవుతోంది. దీనికి తోడుగా ధరలపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం వ్యాపారుల కూడా కలిసొచ్చింది. అయితే చందాలు వేసుకుని కొనుగోలు చేసే కమిటీలపై ఈ ధరల ప్రభావం పడుతోంది.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

– ఎస్పీ రాజేంద్ర ప్రసాద్



సూర్యాపేట క్రైం: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతారవణంలో జరుపుకోవాలని, మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ నెల 18న గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీలకు పలు సూచనలు చేశారు. నవరాత్రి ఉత్సవాలకు పోలీస్‌శాఖ పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రధానంగా మండపాల నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలని, మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. గణేష్ మండపాలు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయొద్దని, వాహనాలకు దారి వదలాలని కోరారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో అనుమతి, ట్రాఫిక్ రూల్స్, ఇతర విషయాలను వివరించారు.

ఆర్టీసీ కార్మికులకు నష్టం జరగకుండా చూడాలి

భానుపురి: ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కావడంతో తమకు ఎలాంటి నష్టం జరగకుండా వేతన ఒప్పందాలు, బకాయిలు చెల్లించాలని సూర్యాపేట బస్ డిపోకు చెందిన ఆ సంస్థ కార్మికులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిపో ఎదుట పలువురు కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు బత్తుల సుధాకర్, సైదులు, ఉప్పు లక్ష్మయ్య, ఇంద్రయ్య, యూసఫ్, లింగయ్య, సైదులు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 12,238 మంది హాజరు

- పేపర్–1కు 6,175.. పేపర్–2కు 6,063 మంది
- రెండు పరీక్షలకు 1,823 మంది గైర్హాజరు
- పలు కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, డీఈఓ

సూర్యాపేట టౌన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. రెండు సెషన్లలో పరీక్షను నిర్వహించారు. పేపర్–1ను ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్–2ను మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించారు. జిల్లాలో 31 సెంటర్లలో పేపర్–1 పరీక్షకు 6,664 మంది అభ్యర్థులకు గాను 6,175 మంది హాజరయ్యారు. 489 మంది గైర్హాజరయ్యారు. అలాగే 29 సెంటర్లలో పేపర్–2 పరీక్షకు 7,397 మంది అభ్యర్థులను గాను 6,063 మంది హాజరుకాగా 1,334 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా రెండు పరీక్షలకు 12,238 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతి సెంటర్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లను అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పరిశీలకుడు నర్సింహ, జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ తనిఖీ చేశారు. ఇదిలా ఉండగా సూర్యాపేటలో కొందరు చిన్నపిల్లల తల్లులు పరీక్ష రాయడానికి వెళ్లడంతో చిన్నారుల తండ్రులు, బంధువులు వారిని ఆడిస్తూ కేంద్రాల సమీపంలో కనిపించారు.



సూర్యాపేటలోని ఏవీఎం పాఠశాలలో హాల్ టికెట్లను పరిశీలించి అభ్యర్థులను లోపలికి పంపుతున్న సిబ్బంది



సూర్యాపేటలోని ఓ సెంటర్‌లో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



ఏవీఎం పాఠశాల సెంటర్‌ను పర్యవేక్షిస్తున్న డీఈఓ అశోక్



తల్లులు పరీక్ష రాసేందుకు వెళ్లడంతో పేటలో ఓ సెంటర్ వద్ద చిన్నారులను ఆడిస్తున్న బంధువులు

పర్యావరణ పరిరక్షణకు కృషి



పరికరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఇందులో భాగంగా బాలికల వసతి గృహాలకు ఇన్సినరేటర్ పరికరాలను అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్సినరేటర్ మిషన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు రుతుక్రమ సమయంలో వినియోగించే శానిటరీ నాప్‌కిన్స్ బయట వేయడం వల్ల భూమి కలుషితమవుతోందన్నారు. ఈ నాప్‌కిన్స్‌లో వాడే ప్లాస్టిక్ భూమిలో కలవడానికి సుమారు వందేళ్ల పడుతుందని, కాబట్టి వాటిని ఇన్సినరేటర్స్‌లో దహనం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జ్యోతిపద్మ, శ్రీ బాలాజీ మోటార్స్ చెందిన రజిని, మల్లయ్య, ఏఓ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.


ఓటర్లను చైతన్యపర్చేందుకే 'క్రియే–థాన్'

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఓటర్లను చైతన్యపరిచేందుకే కేంద్ర ఎన్నికల సంఘం 'క్రియే–థాన్ 2023' పేరిట పోటీలను నిర్వహించాలని నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ భాషల్లో పోస్టర్ల రూపకల్పన, నిమిషం నిడివి గల వీడియోలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల గుర్తులు, వ్యక్తులు ఉండొద్దని, పోస్టర్లను నేరుగా https://tinyurl.com/electioncrea&thon 2023 వెబ్‌సైట్‌కు, వీడియోలను యూట్యూబ్లో అప్లోడ్ చేసి ఈ నెల 23 తేదీలోగా పంపాలని సూచించారు. విజేతలకు రూ.20 వేల నగదు బహుమతులివ్వాలని నిర్ణయించిందని కలెక్టర్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు ఓరుగంటి రాములు సంతాప సభ

- హాజరుకానున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ


ఓరుగంటి రాములు (ఫైల్)

నల్లగొండ టూటౌన్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములు సంతాప సభ శనివారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో కుటుంబ సభ్యులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరు కానున్నట్లు ఓరుగంటి రాములు కుటుంబ సభ్యులు తెలిపారు.

కాపర్ వైరు చోరీ

మునగాల: గుర్తుతెలియని వ్యక్తులు మునగాల శివారులో ఎస్‌ఎస్పీ ప్రధాన గేట్ల బేరింగ్‌లలో ఉన్న కాపర్ వైరును గురువారం రాత్రి చోరీ చేశారు. ఎస్‌ఎస్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఎడమకాలువ వద్ద ముక్త్యాల బ్రాంచి కాలువపై ఏర్పాటు చేసిన గేట్లపైన అమర్చిన రెండు పెద్ద సైజు బేరింగులను ఊడదీసి సుమారు రూ.రెండు లక్షల విలువ గల కాపర్ వైరును అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఎస్‌ఎస్పీ సిబ్బంది శుక్రవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఇదే ఎడమకాలువపై 15రోజుల క్రితం మునగాల శివారులో ఉన్న ఎస్కేప్ తలుపులకు సంబంధించిన నాలుగు బేరింగ్‌లలోని కాపర్‌వైర్ చోరీకి గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీని విలువ సుమారు రూ.నాలుగు లక్షలు ఉంటుందని అంచనా. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

విద్యార్థిని గాయపర్చిన ఉపాధ్యాయుడు


గాయపడిన సిరాజ్

తుంగతుర్తి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు గాయపరిచాడు. తుంగతుర్తిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో కోదాడకు చెందిన షేక్ సిరాజ్ ఆరవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో గురువారం నైట్ డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయుడు శుక్రవారం ఉదయం విద్యార్థులను నిద్రలేపే క్రమంలో సిరాజ్ తలపై ఇనుప చువ్వతో కొట్టాడు. దీంతో విద్యార్థి తలకు గాయమైంది. తోటి ఉపాధ్యాయులు ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఉమారెడ్డికి తెలిపి విద్యార్థిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రిన్సిపాల్ ఉమారెడ్డి వివరణ కోరగా.. విద్యార్థి గాయపడిన సంఘటనపై గురుకుల పాఠశాల ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గిరిజన బాలికల హాస్టల్‌లో అధికారుల విచారణ


హాస్టల్‌లో వంటలను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల గిరిజన బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, ఏసీఎంఓ డివి నాయక్ విచారణ జరిపారు. హాస్టల్ విద్యార్థినులను తరగతుల వారీగా పిలిచి అస్వస్థతకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అపెండెక్స్‌తో ఒకరికి కడుపు నొప్పి రాగానే మిగతా విద్యార్థినులు భయాందోళనకు గురైనట్లు రాజ్‌కుమార్ తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థినులు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. త్వరలో హాస్టళ్లలో ఏఎన్‌ఎం అందుబాటులో ఉండే విధంగా చూస్తామన్నారు. అనంతరం వంటలను పరిశీలించారు. వారి వెంట హాస్టల్ వార్డెన్ అహల్య తదితరులున్నారు.

- ఆలస్యంగా అభ్యర్థులు.. అనుమతి నిరాకరణ


భువనగిరి మదర్ థెరిస్సా స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి తాళం వేయడంతో గేటు బయటే నిల్చున్న అభ్యర్థులు


భువనగిరిలోని జాగృతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు

- పరీక్ష కేంద్రం ఎదుట కిటకిట


భువనగిరి పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం ఎదుట వేచి ఉన్న అభ్యర్థులు

యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఫోర్‌మెన్ సస్పెన్షన్

మిర్యాలగూడ : దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్‌ప్లాంట్‌లో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రవితేజపై సస్పెన్షన్ వేటు వేస్తూ టీఎస్ జెన్‌కో చీఫ్ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి ఎ.ముత్యంరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రవితేజ శ్రీశైలం ఎడమగట్టు భూగర్భజల విద్యుత్ కేంద్రంలో పని చేస్తుండగా సహచర ఉద్యోగులతోపాటు ఉన్నతాధికారులతో అనుచితంగా వ్యవహరించినందున ఇక్కడికీ బదిలీపై వచ్చారు. విచారణ జరిపిన ఉన్నతాధికారులు నివేదిక ఆధారంగా ఉద్యోగం నుంచి రవితేజను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

విధులు ముగించుకుని వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి దుర్మరణం
- మరో టీచర్‌కు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం


ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయులు

సూర్యాపేట రూరల్ : విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని కారు రూపంలో మృత్యువు కబళించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట మండల పరిధిలోని ఎర్కారం గ్రామ సమీపంలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అర్వపల్లి మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన సైరెడ్డి మల్లారెడ్డి (55) ఉక్కు వెంకన్న అర్వపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ సూర్యాపేట పట్టణంలో నివాసం ఉంటున్నారు. రోజువారీగా ఒకే బైక్‌పై అర్వపల్లిలోని పాఠశాలకు వెళ్లి తిరిగి సూర్యాపేట వస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం పాఠశాల నుంచి సూర్యాపేటకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సూర్యాపేట–జనగాం రహదారిపై ఎర్కారం గ్రామ సమీపంలోని రేఖ్యానాయక్ తండా వద్ద ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మల్లారెడ్డి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకన్న పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

చీరలను అపహరిస్తూ చిక్కిన కి‘లేడీ’


సీసీ ఫుటేజీలో రికార్డయిన చీరల చోరీ దృశ్యం

భూదాన్‌పోచంపల్లి : గుట్టుచప్పుడు కాకుండా చీరలను అపహరించిన మహిళను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధితుడు ధనుంజయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని సుష్మ మ్యాచింగ్ సెంటర్‌కు వచ్చిన గుర్తు తెలియని మహిళ చీరలు కావాలని చూపించమని కోరింది. ఆమెకు చీరలు చూపిస్తుండగానే గిరాకీ రావడంతో యజమాని వారితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని మహిళ రెండు చీరలను దొంగలించి బయటికి వెళ్లిపోయింది. కొద్దీ దూరం వచ్చి లోదుస్తుల్లో దాచిన చీరలను బయటికి తీసి కవర్‌లో వేస్తుండగా సమీపంలో ఉన్న ఓ వ్యక్తి గమనించి షాపు యజమానికి సమాచారం ఇచ్చాడు. గషాపులో ఉన్న సీసీ కెమెరాలో సీసీ ఫుటేజీని పరిశీలించగా అందులో చీరలు దొంగిలిస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన షాపు యజమాని ఆమెకోసం వెతుకుతుండగా స్థానిక మార్కండేయ దేవాలయం వద్ద కన్పించింది. పట్టుకొని ప్రశ్నించగా అమె పొంతనలేని సమాధానాలు చెప్పింది. దాంతో ఆమెను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అయితే పోలీసుల విచారణలో పట్టుబడిన మహిళ పేరు చేకూరి సునిత అని, తనది దిల్‌సుఖ్‌నగర్ అని చెబుతుంది. ఉదయం నుంచి చీరలు కావాలని, జాకెట్లు కుడుతారా అని పలు షాపుల్లో తిరిగినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితం పట్టణ కేంద్రంలోని ఓ షాపులో చీరలు దొంగతనం కేసులో ఈమె పాత్ర ఉండవచ్చునని అనుమానిస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

భువనగిరి : హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి మారుతిదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణంలోని హన్మాన్‌వాడకు చెందిన రేపాక నాగరాజు, తన భార్య కవిత, ఇద్దరు పిల్లలతో కలసి జీవిస్తున్నాడు. నాగరాజు వెల్డింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కవిత తరచూ ఫోన్లో మాట్లాడుతుండడంతో మరొకరితో సఖ్యతగా మెలుగుతోందని నాగరాజు అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలోనే 2019వ సంవత్సరంలో పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో తగాదా పెట్టుకున్నాడు. మద్యం మత్తులోనే బండరాయితో మోది కవితను హత్య చేశాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నాగరాజుకు జీవితఖైదుతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్షణ పడేలా కృషి చేసిన సీఐ సురేందర్, సిబ్బంది దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌లను అభినందించారు.

దాడి కేసులో ఐదేళ్ల జైలు

గుండాల : దాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ భువనగిరి అడిషనల్ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన ఆశబోయిన రామచంద్రు, ఆశబోయిన మల్లేష్‌లు అన్నదమ్ములు. వీరు 2016వ సంవత్సవం జూలై 12న వ్యవసాయ బావి వద్ద తగాదా పడ్డారు. అనంతరం తమ్ముడు మల్లేష్ తీవ్ర ఆవేశంతో రామచంద్రు ఇంటి మీదికి వెళ్లి సోదరుడిపై గొడ్డలితో దాడి చేశాడు. మరుసటి రోజు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఏఎస్‌జే జడ్జి దశరథ రామయ్య నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.స్వామి, ఎస్‌ఐ యాకన్న, కానిస్టేబుల్ మధుకర్‌ను డీసీపీ రాజేష్‌చంద్ర, ఏసీపీ శివరాంరెడ్డి అభినందించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం

మర్రిగూడ : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మర్రిగూడ మండలం సరంపేట గ్రామానికి చెందిన దామెర అభిలాష్(35) కొంతకాలంగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నల్లగొండ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున అభిలాష్ మృతిచెందాడు. భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన రిటైర్డ్ టీచర్ మృతి

నకిరేకల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు మృతిచెందాడు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన వద్ది లక్ష్మీనారయణ(65) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి విరమణ పొందారు. లక్ష్మీనారాయణ నాలుగు నెలల క్రితం బైక్‌పై నకిరేకల్ నుంచి చందుపట్ల గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో చీమలగడ్డ ఫ్లై ఓవర్ కింద ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుధీర్ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సూర్యాపేట : కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస వేతనం కింద నెలకు రూ.26వేలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంటా నాగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో పట్టణంలోని మంత్రి జగదీష్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నాన్ టీచింగ్ వర్కర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐ, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా రూ.25లక్షలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, సహాయ కార్యదర్శి దేశోజు మధు, తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు గీత, జానీబేగం, ఎల్లమ్మ, లక్ష్మమ్మ, వసంత, కళమ్మ, అరుణ, ధనలక్ష్మి, ప్రవంతి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


బొమ్మలరామారం : ఆధారాలు సేకరిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది

బొమ్మలరమారం : దుండగులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామ సర్పంచ్ యంజాల కళ భర్త సత్యనారయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఇంటిని వదిలి వేయాల్సి రావడంతో 20 రోజులుగా సర్పంచ్ కళ అత్తవారి ఇంటి వద్ద నివాసం ఉంటుంది. పాత ఇంటి వైపు శుక్రవారం వెళ్లి చూడగా తాళం విరగ్గొట్టి ఉండడాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూసింది. బీరువాలోని బట్టలు ఇతర వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతో పాటు అందులోని 3 తులాల బంగారు, 40 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి సంఘటన పరిశీలించి, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి బావిలో విగతజీవుడై..

- ఆత్మహత్యగా పోలీసుల ప్రాథమిక నిర్ధారణ


పరుశరామ్ (ఫైల్)

రాజాపేట : అదృశ్యమైన వ్యక్తి వ్యవసాయ బావిలో విగతజీవుడై కనిపించాడు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా, మరుకుక్ మండలం, పాములపర్తి గ్రామానికి చెందిన సాధుల లావణ్య తన భర్త పరుశరామ్ (35)తో కలిసి ఇటీవల రాఖీ పండుగకు రాజాపేట మండలంలోని సింగారంలో ఉంటున్న పుట్టింటికి వచ్చింది. పరుశరామ్ అనారోగ్యానికి గురికావడంతో కొద్ది రోజులుగా అక్కడే ఉంటోంది. ఈ నెల 10వ తేదీన పరుశరామ్ అత్తింటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో లావణ్య మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గురువారం రాత్రి సింగారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికితీయించిన పోలీసులు చనిపోయిన వ్యక్తి పరుశరామ్‌గా అతడి కుటుంబ సభ్యుల ద్వారా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరుశరామ్‌కు డిపోకల్లు తాగే అలవాటు ఉందని, అది ఇక్కడ లభించకపోవడంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

నేరేడుచర్ల : గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. ఈ ఘటన నేరేడుచర్ల మండలం మేడారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నెమిలితోక సాడమ్మ గురువారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రించింది. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి సాడమ్మ మెడలోని రెండు తులాల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. బాధితురాలి నిద్రలోంచి లేచి కేకలు వేయడంతో దుండగుడు కనిపించకుండాపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

కట్టుకున్నోడే కాలయముడు

- వీడిన గర్భిణి అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ
- క్షణికావేశం, కుటుంబ కలహాలతోనే ఘాతుకం
- నిందితుడి అరెస్ట్, రిమాండ్

మర్రిగూడ : మర్రిగూడ మండలం అజ్జిలాపురంలో ఇటీవల వెలుగుచూసిన గర్భిణి అనుమానాస్పద మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. కుటుంబ కలహాలు, క్షణికావేశంతో భర్తే ఆమెను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అరెస్ట్ చేసిన నిందితుడిని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియా ఎదుట ప్రవేశపెట్టి ఎస్‌ఐ రంగారెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మర్రిగూడ మండలం కమ్మగూడేనికి చెందిన సుష్మిత, అజ్జిలాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ప్రేమించుకుని ఈ ఏడాది జనవరిలో వివాహం చేసుకున్నారు. సుష్మిత ప్రస్తుతం ఏడు నెలల గర్భవతి. దంపతుల మధ్య కొంత కాలంగా మనస్పర్థలు ఏర్పడి గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో ఈ నెల 10వ తేదీన రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. క్షణికావేశానికి గురైన శ్రీకాంత్ దిండుతో సుష్మితను అదిమిపట్టి ఊపిరి ఆడనీయకుండా చేశాడు. అనంతరం మాల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ తర్వాత సుష్మిత మృతదేహాన్ని మర్రిగూడ ఆస్పత్రికి తీసుకొచ్చి అనారోగ్య కారణాలతో మృతిచెందినట్లు చిత్రీకరించాడు. మృతురాలి సోదరి శ్రీకాంత్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. కుటుంబ కలహాలు, క్షణికావేశంలోనే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన దేవరకొండ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ వివరించారు.

పురుగుల మందు తాగిన మహిళ..

- చికిత్స పొందుతూ మృతి

చింతపల్లి : పురుగుల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన జంగిటి ఇందిరమ్మ (35) భర్త రామ్మోహన్ ఇద్దరు కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నసర్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద వారికున్న ప్లాటు (ఖాళీ స్థలం)ను కొంతకాలం క్రితం అదే గ్రామానికి చెందిన బంధువులకు విక్రయించారు. ప్లాట్ విషయమై ఇరు కుటుంబాల మధ్య నెల రోజుల కిందట తగాదా చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన ఇందిరమ్మ ఇంట్లో ఉన్న వరి చేను కలుపుతీత మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా నెల రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఇందిరమ్మ మృతికి బంధువులే కారణమని ఆరోపిస్తూ శుక్రవారం మృతదేహాన్ని వారి ఇంట్లో వేసి ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీశ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పినప్పటికీ ఆందోళనకారులు న్యాయం కావాలని భీష్మించారు. రాత్రి వరకు ఆందోళన కొనసాగుతూనే ఉంది. మృతురాలి భర్త రామ్మోహన్ ఈ విషయమై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త లవకుమార్

పెన్‌పహాడ్ : మిరప సాగు చేస్తున్న రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ సూచించారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రంలోని గడ్డిపల్లి శాస్త్రవేత్తల బృందం మిరప సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నీటి వసతి ఉన్న నేలల్లో నాటుకునేటప్పుడు మొక్కలు నేల స్వభావాన్ని బట్టి దూరాన్ని ఎంచుకొని రెండు వైపులా అచ్చులుగా దున్నుకోవాలన్నారు. పంటలో కలుపు మొక్కలు ఉంటే మొక్కలు నాటిన 25రోజుల తరువాత క్విజాలోఫాస్ ఇథైల్ ఎకరానికి 400–500మిలీ పిచికారీ చేయాలన్నారు. మొక్కలు నాటిన 20నుంచి 25రోజుల లోపు ఎకరానికి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను తగిన మోతాదులో వేసుకోవాలన్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఎకరానికి 50చొప్పున పసుపు, నీలిరంగు, తెలుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్ నరేష్, సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ్, రైతులు సీతారాంరెడ్డి, సంజీవరెడ్డి, అంజయ్య, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు

- నడిగూడెం ఏఓ రాజగోపాలరావు


రాజగోపాలరావు మండల వ్యవసాయ అధికారి

నడిగూడెం : వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటలపై కూడా ఈ మధ్యకాలంలో రసాయన మందుల వాడకం గణనీయంగా పెరిగింది. వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించేందుకు రైతులు ప్రమాదకరమైన మందులను ఆశ్రయిస్తున్నారు. పంట కాలంలో ఆరు నుంచి పదిసార్లు రసాయన మందులను పిచికారీ చేయడం ఆందోళనకరం. వాడే పద్ధతి తెలియక పోవడం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో పలువురు రైతులు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మరికొందరు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రస్తుతం రసాయన మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు పాటించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు చెబుతున్న జాగ్రత్తలు ఆయన మాటల్లోనే.. రైతులు రసాయన మందుల పిచికారీని తేలికగా తీసుకుంటున్నారు. అదుపు తప్పితే పురుగుకు కాదు మనిషికి ప్రాణాపాయమని గుర్తించడంలేదు. మిరప, వరి, పత్తి పంటలకు తెగుళ్ల తీవ్రతను బట్టి ప్రమాదకరమైన రసాయనాలను వాడుతున్నారు. పిచికారీ సమయంలో కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. మందులు కలిపే సమయంలో ఎటువంటి తొడుగులు ఉపయోగించకుండా చేతితో లేదా కర్రలను ఉపయోగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో 14 ఏళ్ల లోపు పిల్లలు కూడా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. పిచికారీ చేసిన తర్వాత భోజనాలు, నీళ్ల తాగడం, పొగతాగడం సాధారణంగా మారింది. ఆ మందు డబ్బాలను ఇళ్లల్లో నిత్యం నీటి నిల్వకు వాడుకుంటున్నారు.


పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పాడి పంట

ఇవి తప్పనిసరి..

- పిచికారీ ముందు వ్యక్తి తప్పనిసరిగా ముక్కు, కళ్లకు మందు తాకకుండా శిరస్త్రాణం లాంటివి తప్పనిసరిగా ధరించాలి.
- మందును ట్యాంకుల్లో కలుపుకునే సమయంలో చేతులకు తొడుగులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో నీళ్ల తాగడం, బీడీ, సిగరెట్ లాంటివి, పొగపీల్చడం తినడం వంటివి చేయరాదు.
- పిచికారీ అనంతరం పరిశుభ్రంగా స్నానం చేసుకున్న తర్వాతే ఆహార పదార్థాలు తినాలి.
- మందును గాలి వీచే వ్యతిరేక దిశలో పిచికారీ చేయరాదు.
- సాధ్యమైనంతవరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే పిచికారీ చేయడం మంచిది.
- పురుగు మందు పిచికారీపై రైతులకు అవగాహన ఉండాలి.
- కొన్ని రకాల రసాయన మందులు రెండు నుంచి మూడు కలిపి పిచికారీ చేయడం చాలా ప్రమాదకరం.
- రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

- పిచికారీ సమయంలో రసాయనిక మందుల ప్రభావం ఊపిరితిత్తుల నుంచి నేరుగా మెదడుకు వెళ్లిపోతుంది. ప్రాథమిక చికిత్సకు అవకాశాలు తక్కువగా ఉంటాయి. అత్యవసర చికిత్సయే శరణ్యమవుతుంది. రైతులు పూర్తిస్థాయి దుస్తులు ధరించి పురుగు మందులు పిచికారీ చేయడం ఉత్తమం.